క్లుప్తంగా

చిత్రకళాకారుడు కాంతారావుకు సన్మానం



కాంతారావును సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : క్రియేటివ్ ఆర్ట్స్, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో మాస్టర్ స్ట్రోక్-3 పేరిట దేశంలోని 50 మంది ప్రసిద్ధ చిత్రకళాకారులతో ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఏలూరు నగరానికి చెందిన మజ్జి కాంతారావు చిత్రించిన గణపతి చిత్రపటం సందర్శకులను విశేషంగా ఆకర్షించింది. కాంతారావు సేవలను వక్తలు ప్రశంసించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు అంజి ఆకొండి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి తదితర అతిథులు కాంతారావును దుశ్శాలువాతో సత్కరించారి జ్ఞాపిక బహూకరించారు. కాంతారావుకు దక్కిన సన్మానం పట్ల నగరానికి చెందిన ఏలూరు ఆర్ట్ సొసైటీ ప్రతినిధులు ఎం మధుసూదనరావు, శ్రీనివాస్ తదితరులు గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

21 నుంచి ఉచిత దత్త క్రియా యోగ శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఈ నెల 21 నుంచి 24 వరకు ఉచిత దత్త క్రియా యోగ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు హిందూ యువజన సంఘం అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మైసూర్ దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వద్ద శిక్షణ పొందిన వేణుగోపాల్ లునాని, పి.సాంబశివరావు నిత్యం ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు యోగాసనాలు, ధ్యానం, నాడీ శుద్ధి వ్యాయామాలు, ఆహార నియమాలు తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. దీనికి 15 ఏళ్ల వయసు పైబడిన వారంతా అర్హులని తెలిపారు.

బకాయిలు చెల్లించాలి

ఏలూరు(మెట్రో): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఏలూరు జెడ్పీ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నినదించారు. రాష్ట్ర జేఏసీ నాయకులు ఆర్ఎస్ హరనాథ్, యూటీఎఫ్ నాయకులు ఆర్ రవికుమార్, అలీ, పాలిశెట్టి, పీఆర్‌టీయూ నాయకులు పువ్వుల ఆంజనేయులు, ఏలూరు తాలూకా జేఏసీ చైర్మన్ ఎ.శ్రీధర్‌రాజు, కన్వీనర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'తో ఆనందోత్సాహం

- ఏలూరు క్రికెట్ జట్టుకు రూ.లక్ష చెక్కు అందజేత
- ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం – ఆంధ్ర పోటీలు నిర్వహించి యువతలో క్రీడోత్సాహాన్ని పెంచారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. విశాఖపట్టణం వైఎస్సార్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆడుదాం – ఆంధ్ర క్రికెట్ పోటీల్లో ఏలూరు జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టు ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల నానిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ క్రీడాకారులను ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, ఎమ్మెల్యే నాని ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. క్రికెట్ జట్టులోని ప్రతి సభ్యుడినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. రాబోయే కాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. క్రీడాకారులకు రూ.లక్ష ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపే విధంగా ఆడుదాం ఆంధ్ర దోహదపడిందని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లోని యువతలో క్రీడాప్రతిభను వెలికితీసి వారిలో నైపుణ్యాలను మరింత సానబెట్టి అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చేలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం, క్రీడా స్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఏలూరు పేరును నిలబెట్టాలని ఎమ్మెల్యే నాని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, క్రికెట్ జట్టు కోచ్, సభ్యులు ఉన్నారు.



'ఆడుదాం ఆంధ్ర' క్రికెట్ చాంపియన్స్‌కు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్



క్రికెట్ చాంపియన్స్‌ను అభినందిస్తున్న బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

క్రికెట్ జట్టుకు అభినందన

ఏలూరు(మెట్రో): ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన ఏలూరు క్రికెట్ జట్టును బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాద్ అభినందించారు. భవిష్యత్తులో క్రీడలకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రసాద్ తెలిపారు. క్రీడలను ప్రోత్సహించిన సీఎం జగన్ ఒక్కరేనని పల్లె నుంచి పట్టం, నగరాల్లోనూ ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పారు. ఇంత చక్కటి విజయాన్ని అందించిన మన ఏలూరు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ టీంను ప్రత్యేకంగా అభినందించారు. జెడ్పీటీసీ సభ్యులు, మండల సరస్వతి కొండలరావు, తుమ్మగుంట భవానీ రంగా, స్థానిక కార్పొరేటర్ కలవకొల్లు సాంబ పాల్గొన్నారు.

సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలకు నాక్ – ఏ గ్రేడ్ లభించిందని కరస్పాండెంట్ మాగంటి రాజారామ్మోహనరావు తెలిపారు. ఈ మేరకు నాక్ బృందం కళాశాలను సందర్శించి గురువారం ఏ గ్రేడ్ గుర్తింపు పత్రాలను అందించినది చెప్పారు. నాక్ ప్రతినిధులు తమ కళాశాలను సందర్శించి కళాశాలలో అందుబాటులో ఉన్న ప్రమాణాలు, విద్యార్థులు నిష్పత్తి, విద్యార్థులకు యాజమాన్యం కల్పించిన మౌలిక వసతులు, సిబ్బంది, విద్యార్థులు చేపట్టిన వివిధ పరిశోధనా ప్రాజెక్టులు వంటి కేటగిరీలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారని వివరించారు. ప్రిన్సిపాల్ ఎ.నరేంద్రబాబు మాట్లాడుతూ తమ కళాశాలకు నాక్ – ఏ గ్రేడు గుర్తింపు రావడంతో తమపై మరింత బాధ్యత పెంచిందన్నారు. ఫార్మసీ కళాశాలలో నాలుగేళ్ల బీ ఫార్మసీ కోర్సు, రెండేళ్ల డీ ఫార్మసీ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని కోర్సుల్లో కలిపి మొత్తం 520 మంది విద్యార్థులున్నారని తెలిపారు. కళాశాల ఈ స్థాయికి చేరుకోవడానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన విద్యా సంస్థల అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్, కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, ఇతర ఆఫీస్ బేరర్లు, మేనేజింగ్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలకు నాక్ - ఏ గ్రేడ్ సర్టిఫికెట్ అందిస్తున్న నాక్ ప్రతినిధులు

ప్రభుత్వ రంగ విద్యపై ప్రత్యేక దృష్టి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో ప్రభుత్వ రంగ విద్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని సమగ్రశిక్షా అభియాన్ ఏలూరు జిల్లా అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.సోమశేఖర్ అన్నారు. ఏలూరు తహసీల్దారుగా పని చేస్తూ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన సోమశేఖర్ గురువారం తన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఆదేశించిన లక్ష్యాలను కాలంలో పూర్తి చేసి జిల్లాను అగ్రభాగంలో నిలిపేందుకు కృషి చేస్తానని సోమశేఖర్ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రెండో విడతలో చేపట్టిన మన బడి నాడు – నేడు పనులు పూర్తిచేసి విద్యార్థులకు అధునాతన తరగతి గదులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జగనన్న విద్యాకానుకను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే రోజునే విద్యార్థులకు అందలేలా చర్యలు చేపడతామని తెలిపారు. సోమశేఖర్‌కు వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు గెడ్డం సుధీర్, వి.రామ్మోహనరావు, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు, సమగ్రశిక్ష అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్ఎస్ఏ ఏపీసీ సోమశేఖర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తున్నారని, మరోసారి 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, పార్టీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలచారి అన్నారు. ఏలూరులోని వాకర్స్ అసోసియేషన్ హాలులో గురువారం గౌడ్ సంఘం అధ్యక్షులు ఎలకల సూరిబాబు, పెద్దలు సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేపల్లి సత్తిబాబు గౌడ్, అచ్యుత్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొద్దాని మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో అభివృద్ధికి చిరునామాగా ఎమ్మెల్యే ఆళ్ల నాని నిలిచారని, మరోసారి ఆయన విజయానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. బీసీ పక్షపాతిగా ఉంటూ బీసీ సామాజికవర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న నాని నాల్గోసారి విజయం సాధించడం ఖాయమని అన్నారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ విజయానికి ప్రతి బీసీ కృషి చేయాలని కోరారు. సమావేశంలో బత్తిన మస్తాన్‌రావుగౌడ్, వీరంకి పండుగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, గౌడ సంఘీయులు ఉన్నారు.



గౌడ సంఘీయుల సమావేశంలో పాల్గొన్న ఇడా చైర్మన్ బొద్దాని

జగన్‌ను రెండోసారి సీఎంని చేయడానికి సిద్ధం

ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

పెదపాడు: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెండోసారి రెపరెపలాడటం ఖాయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలం ఏపూరు గ్రామంలో ఆయన గురువారం ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ ఏపూరులో డీబీటీ రూపంలో రూ.31 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.17.65 కోట్లు ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎం సీట్లో కూర్చోబెట్టేందుకు సిద్ధమా అని కోరగా ప్రజలు సిద్ధమంటూ ముక్తకంఠంతో నినదించారు. జగన్ ప్రభుత్వంలో డ్వాక్రా రుణమాఫీ అవుతోందా లేదా, అమ్మఒడి వస్తోందా, చేయూత, వాహన మిత్ర వస్తోందా అని అడుగగా.. అన్నీ సక్రమంగానే వస్తున్నాయంటూ ప్రజలు బదులిచ్చారు. 10 ఎకరాలకు పైగా భూమిని రూ.4 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు అందించామని ఎమ్మెల్యే చెప్పారు. నాడు నేడు పథకంలో రూ.19 లక్షల వ్యయంతో పాఠశాలను అభివృద్ధి చేశామన్నారు. కాలనీలో బోర్‌వెల్, అంతర్గత రహదారులు అభివృద్ధి చేశామని తెలిపారు. రూ.20 లక్షలతో సీసీ రహదారులు అభివృద్ధి చేశామని చెప్పారు. గతంలో చంద్రబాబు మోసాలు గుర్తు చేసుకోవాలని, నేడు జగన్ చేస్తోన్న అభివృద్ధిని ఆదరించాలని కోరారు. రుణమాఫీ, గోల్డ్ లోను మాఫీ చేస్తామని, మూడు సెంట్ల ఇళ్ల స్థలం, గ్యాస్ బండలు ఉచితంగా ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఇచ్చారా ? గత ప్రభుత్వంలో ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చారా అని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రశ్నించడంతో చంద్రబాబు ఇవ్వలేదంటూ ప్రజలు తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు గ్రామాల్లో తిరుగుతూ గ్యారంటీ ఇస్తామని చెబుతున్నాయని, వారికే గ్యారంటీ లేదు.. మన భవిష్యత్‌కు వారేమి గ్యారంటీ ఇస్తారో అర్థం కాలేదని ఎమ్మెల్యే కొఠారు విమర్శించారు. మనకు గ్యారంటీ ఇచ్చేందుకు జగనన్న ఉన్నారని ఆయనే మన భవిష్యత్‌కు ష్యూరిటీ అని చెప్పడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, గ్రామ సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు బెజవాడ శిరీషా, రాజులపాటి నాగమల్లేశ్వరావు, బెజవాడ శేఖర్, బెజవాడ సత్యనారాయణ, బెజవాడ నర్సింహారావు, ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్ చౌదరి, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని పాల్గొన్నారు.



ఏపూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	48	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	40	కంద	60
పచ్చిమిర్చి	34-36	బీట్‌రూట్	38
కాకర కాయలు	44-54	కీరా దోస	30
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	--	అల్లం	120
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	30-24	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	24	తోటకూర	10
ఉల్లిపాయలు	20-24	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30-34	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	11
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34

ఆర్టీసీ డ్రైవర్లకు నేడు అవార్డుల ప్రదానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రమాదాలకు తావులేకుండా విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు ఆ సంస్థ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్లో నిర్వహించే కార్యక్రమంలో జోన్, జిల్లా, డిపో స్థాయిల్లో అవార్డులను ప్రదానం చేయనుంది. విజయవాడ జోన్ పరిధిలో బీవీఆర్‌ఎం రావు (ఏలూరు డిపో) ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన విజయవాడలో ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి అవార్డు అందుకుంటారు. ఏలూరు జిల్లా స్థాయిలో.. ఎస్కే దస్తగిరి (నూజివీడు డిపో), జె.చెల్లయ్య, టీడీ చారి (ఏలూరు డిపో), ఏలూరు డిపో స్థాయిలో.. ఆర్‌వీ రావు, పీవీవీవీపీ రావు, ఎంవీఎస్ఆర్ కృష్ణ, జంగారెడ్డిగూడెం డిపో స్థాయిలో.. బీకే రెడ్డి, డీవీఎస్ఎన్‌టీ రాజు, ఎం చిన్నయ్య, నూజివీడు డిపో స్థాయిలో.. డీవీకే రావు, కేఆర్ కృష్ణ, ఎండీ సిద్దిక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అవార్డులకు ఎంపికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం శుక్రవారం ఏలూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. సత్రంపాడు, శాంతినగర్, ఎంఆర్‌సీ కాలనీ, ఫిరంగుల దిబ్బ కలెక్టర్ బంగ్లా, ఇండస్ట్రియల్ ఏరియా, ఆర్టీసీ కాలనీ, వట్లూరు, సీతారామపురం, అగ్రహారం, అంబికా థియేటర్ సెంటర్, కెనల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై శుక్రవారం నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహ, కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో సమావేశం నిర్వహించారు. కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

పెదపాడు : వట్లూరు సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను తహసీల్దార్ భావన్నారాయణ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. సర్వేయర్ కోదండరామ్, వీఆర్వో, ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలు

ద్వారకాతిరుమల: గుండుగొలనుకుంట గ్రామంలోని జగనన్న కాలనీలో ఐదు నిరుపేద కుటుంబాలు ఆనందోత్సాహాల నడుమ గురువారం గృహ ప్రవేశాలు చేశాయి. స్థానిక సర్పంచ్ బండారు ధనలక్ష్మి, కాశీ రామేశ్వరరావు దంపతులు ముందుగా రిబ్బన్ కట్ చేసి ఇళ్లను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులు అప్పసాని సత్తెమ్మ, అప్పసాని మహాలక్ష్మి, అప్పసాని సుబ్బమ్మ, పలిమిల అనూష, గుదె సత్యవతి గృహ ప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు వారికి నూతన వస్త్రాలను బహుకరించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ సొంతింటి కలను జగనన్న నెరవేర్చారన్నారు. ఒకొక్కరికి సెంటున్నర స్థలాన్ని, గృహ రుణాలను ఇచ్చి సొంత గూడును ఏర్పరిచారని అన్నారు. అనంతరం సర్పంచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ సొంతింటి కల నెరవేరిన వేళ నిరుపేదల కళ్లల్లో ఆనందాన్ని చూస్తున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరుపేదలకు అంతా మంచే జరిగిందనడానికి వీరే నిదర్శనమని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ పలిమిల ఆంజనేయులు, బండారు వెంకన్నబాబు, బండారు నాగ సుబ్బారావు తదితరులున్నారు.



రిబ్బన్ కట్‌చేసి గృహాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి దంపతులు

పుష్పలమ్మ, ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం

దెందులూరు: పెరుగ్గూడెం పంచాయతీ గోవిందపురం గ్రామంలో జగ్గరాజు, శేషమ్మరాజు ఆవరణలో శ్రీ పుష్పలమ్మ, ఎల్లమ్మ తల్లి కల్యాణమహోత్సవం నిర్వహించారు. తొలుత పెరుగ్గూడెం గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కామిరెడ్డి ఆనంద్‌బాబు, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి) ప్రత్యేక పూజలు చేశారు.

గెస్ట్ లెక్చరర్లు కావలెను

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయమ విద్యా కళాశాలలో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేయడానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు అన్నారు. గురువారం వ్యాయామ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఎంపీఈడీ, డిగ్రీలో 55 శాతం మార్కులు ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, ఏపీసెట్‌ల వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయన్నారు. అభ్యర్థులు బయోడేటా, జిరాక్స్ కాపీలను మెయిల్ ఐడీ ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఆర్‌జీసీపీఈజీపీఎం ఎట్‌దారేఫ్ జీమెయిల్‌కు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

షిర్డీ సాయిబాబాకు పుష్పాభిషేకం

పెదవేగి : మండలంలోని లక్ష్మీపురం గార్డెన్స్‌లోని షిర్డీ సాయిబాబా సేవాశ్రమంలో మందిర వార్షికోత్సవాల ఆఖరి రోజు గురువారం బాబా వారికి పుష్పాభిషేకం చేశారు. శ్రీ సాయి నామాలు గల సాయి కోటి పుస్తకాలను భక్తుల చేతుల మీదుగా సాయి వరలక్ష్మి 100 అడుగుల ఎత్తు గల సాయి కోటి మహాస్థూపంలో నిక్షిప్తం చేయడం ఈ రోజు ప్రత్యేకత అని నిర్వాహకులు తెలిపారు.